క్లుప్తంగా

జూనియర్ కళాశాల విద్యార్థినులకు పుస్తకాలు

కపిలేశ్వరపురం: మాచర ప్లస్ టు ఉన్నత పాఠశాల్లో ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థినులకు ప్రభుత్వం సమకూర్చిన పాఠ్య పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని రమాదేవి మాట్లాడుతూ మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా మారుమూల గ్రామాల్లో సైతం ప్రభుత్వం కళాశాలలను నెలకొల్పుతోందన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులను నడుపుతున్నామని, సమీప గ్రామాల విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్లస్ టూ ఉపాధ్యాయులు వాడ్రేవు శ్రీనివాసరావు, నూకపెయ్యి వెంకట్, షిరిడి సాయి, రాయుడు ఉదయ్‌కృష్ణ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష గ్రామ సభల షెడ్యూల్ ఇదే

కపిలేశ్వరపురం: జూలై 1న రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించే జగనన్న సురక్ష కార్యక్రమం షెడ్యూల్‌ను సోమవారం తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి వెల్లడించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి నాయకత్వంలోని బృందంలో డీటీ సీహెచ్ బాలాజీ, ఐకేపీ ఏపీఎం బి.అర్జున్ సభ్యులుగా ఉంటారు. మరో బృందానికి తహసీల్దార్ కొమరం సూర్యారావు నాయకత్వం వహిస్తుండగా విద్యుత్ శాఖ ఏఈ ఎస్.సాల్మన్‌రాజు, తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వై.శ్రీనివాసరావు సభ్యులుగా ఉంటారు.
3న వెదురుమూడి, 4న నేలటూరు, 5న అంగర-2 సచివాలయం, 6న వడ్లమూరు, 7న కాలేరు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తారు. 10న అంగర-01 సచివాలయం, 11న టేకి, 12న పడమర ఖండ్రిక, 13న వాకతిప్ప, 14న టేకి -2 సచివాలయం, 15న కోరుమిల్లి- 01 సచివాలయం, 17న నల్లూరు, 18న కపిలేశ్వరపురం -01 సచివాలయం, 19న మాచర, 20న తాతపూడి, 21న కోరుమిల్లి- 02 సచివాలయం, 22న వల్లూరు, 24న కపిలేశ్వరపురం -02 సచివాలయం, 25న అద్దంకివారిలంక, 26న కేదారిలంకలలో గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ, తహసీల్దార్ తెలిపారు.

గాయపరిచాడని మహిళ ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: తనను గాయపరిచినట్లు మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎస్.సత్య భుజంగరావు సోమవారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 16 న ఇరుగుపొరుగు వారి మధ్యలో జరిగిన ఘర్షణలో కోట శ్రీను అనే వ్యక్తి తనను కర్రతో కొట్టి గాయపరిచాడని, దీంతో తన చేయి విరిగిందని ఖమ్మం చంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళా డైరీ అసోసియేషన్ సెంటర్ ప్రారంభం

రాయవరం: మండలంలోని పసలపూడి సచివాలయంలో సోమవారం మహిళా డైరీ అసోసియేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. సమావేశంలో 64 మంది మహిళా రైతులు పాల్గొన్నారు. మహిళా డైరీ అసోసియేషన్‌కు ఈ సమావేశంలో 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. చీఫ్ ప్రమోటర్‌గా కోట శ్రీలక్ష్మి, ప్రమోటర్‌గా గుడాల వీరవేణి, సెక్రటరీగా కడలి సత్యవేణి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి పద్మావతి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ విజయ, పంచాయతీ విస్తరణాధికారి కరుణాకర్, పంచాయతీ కార్యదర్శి ఎం.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువగట్ల అభివృద్ధికి కార్యాచరణ

తీరనున్న రైతుల కష్టాలు



కాలువగట్టును పరిశీలిస్తున్న జేఈ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

మండపేట: జెడ్.మేడపాడులో అభివృద్ధికి నోచుకోని కాలువగట్టు రోడ్ల అభివృద్ధికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదేశాల మేరకు అధికారులు కార్యాచరణ చేపట్టారు. గ్రామంలోని కాకినాడ కెనాల్, సామర్ల కెనాల్ గట్లను ఆనుకుని సుమారు నాలుగు కిలోమీటర్ల పరిధిలో 650 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. గ్రామంలోని రైతులు పొలాలకు రాకపోకలు సాగించేందుకు, పంట ఉత్పత్తులు తరలించుకునేందుకు ఈ రోడ్ల మీదుగానే రాకపోకలు సాగించాలి. ఎన్నో ఏళ్లగా ఈ గట్లు అభివృద్ధికి నోచుకోకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. జిగురుమట్టి కావడంతో వర్షం వస్తే వాహనాలు మట్టిలో కూరుకుపోయి రాకపోకలకు రైతులు అగచాట్లు పడాల్సి వస్తోంది. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తోరం శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు దేవు ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో స్థానిక రైతులు సమస్యను ఇటీవల ఎమ్మెల్సీ తోటను కలిసి వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన గ్రావెల్ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయా కాలువ గట్లను సోమవారం పీఆర్ జేఈ నాగేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు పరిశీలించారు. త్వరలో వర్షాలు మొదలు కానున్న నేపథ్యంలో రైతుల అవసరాల దృష్ట్యా త్వరితగతిన రోడ్డు పనులు చేపట్టాలని ఎమ్మెల్సీ తోట అధికారులను ఆదేశించినట్టు పార్టీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్‌నాయుడు తెలిపారు.

వరదలొచ్చినా భయం లేదు

- ముందస్తు చర్యలు చేపడుతున్న ప్రభుత్వం
- కపిలేశ్వరపురం, కోటిపల్లి ఫ్లడ్ స్టోర్‌లలో తగిన సామగ్రి నిల్వ
- శాఖల మధ్య సమన్వయంతో ప్రభుత్వం చర్యలు



కపిలేశ్వరపురం ఫ్లడ్ స్టోర్‌లో సిద్ధంగా ఉన్న సామగ్రి



కేదారిలంక తొగరిపాయపై పొంగి పొర్లుతున్న వరదనీరు (ఫైల్)

కపిలేశ్వరపురం: అడపాదడపా చినుకులు పడుతున్నాయి. పూర్తి స్థాయిలో వర్షాలు ప్రారంభం అయ్యాయంటే గోదావరి నది నిండుకుండలా మారుతుంది. గోదావరి తీర ప్రాంత గ్రామాల్లో అలజడి ప్రారంభమవుతుంది. ఇది ఏటా జరిగే తంతే అయినప్పటికీ ప్రభుత్వం తగిన ప్రణాళికతో ముందస్తు చర్యలు తీసుకుంటోంది. గత మూడేళ్లుప్రభుత్వం గోదావరి వరదలను విజయవంతంగా ఎదుర్కొంది. జూన్ చివరివారం, జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లలో వరదల ప్రభావం ఉంటుంది. ఈ నేపథ్యంలో కపిలేశ్వరపురం, కోటిపల్లిలలోని ఫ్లడ్ స్టోర్లను సన్నద్ధం చేస్తున్నారు. ఏటిగట్లను పటిష్టపరిచేందుకు అవసరమైన సామగ్రిని ఇప్పటికే సిద్ధం చేశారు. అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాకాలంలో గోదావరి నీటి ప్రభావాల తీరుపై ఈ కథనం...

లంక గ్రామాల పరిస్థితి ఇలా..

రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం శేరిలంక, మండపేట నియోజకవర్గం కపిలేశ్వరపురం మండలంలో కేదారిలంక పంచాయతీ పరిధిలో శేరిగూడెం, వీధివారిలంక, కపిలేశ్వరపురం గ్రామ పరిధిలో నారాయణలంక, అద్దంకివారిలంక గ్రామ పరిధిలో పల్లపులంక, కోరుమిల్లిలంక గ్రామాలు దాదాపు గోదావరి నదిలో ఉన్నాయి. ఇవి కాకుండా కె.గంగవరం మండలం పరిధిలో కూళ్ల, మల్లవరం, సుందరపల్లి, కోటిపల్లి గ్రామాలు గోదావరి తీరాన ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలందరూ వరదల వేళ ఇబ్బందులను ఎదుర్కొంటాయి. కపిలేశ్వరపురానికి గోదావరి అవతలి ఒడ్డున సుమారు 25 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో కేదారిలంక, అద్దంకివారిలంక శివారు గ్రామాలు ఉండడంతో వరదల సమయంలో పాలనాపరమైన సమస్యలు ఎదురవుతుంటాయి. అక్కడి వ్యవసాయ క్షేత్రాలు, నివాస ప్రాంతాలు ముంపుబారిన పడతాయి. ముంపు బాధితులకు సాయం అందించేందుకు కపిలేశ్వరపురం నుంచి పడవల్లో ఆహార పదార్థాలను అధికారులు తరలిస్తుంటారు.

ఫ్లడ్ స్టోర్ల సన్నద్ధం..

గోదావరి గట్లు బలహీన పడినప్పుడు పటిష్ట పరిచేందుకు ఇసుక, సంచులు, బారికేట్ కర్రలు, గడ్డపారలు, పారలు ఇతర సామాగ్రి అవసరమవుతాయి. కపిలేశ్వరపురం, కోటిపల్లిలలో రెండు ఫ్లడ్ స్టోర్‌లు ఉన్నాయి. కపిలేశ్వరపురం ఫ్లడ్ స్టోర్‌లో ఇప్పటికే ప్రభుత్వం సామగ్రిని సమకూర్చింది. 1,000 సర్వే బాదులు, 2,800 వెదురు బాదులు, 40 వేల సంచులు, 370 క్యూబిక్ మీటర్ల ఇసుక, కత్తులు, పారలు, గొడ్డళ్లను సిద్ధం చేశారు. గ్రామాల్లో వరదనీటి పరిస్థితులపై పంచాయతీ, రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక శాఖల అధికారులను ప్రభుత్వం ఇప్పటికే అప్రమత్తం చేసింది.

మూడేళ్లుగా సమర్థవంతంగా..



మూడేళ్లుగా వరదలను ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొంటోంది. గతేడాది లంక గ్రామాల్లో అధికారులు సకాలంలో పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఫలితంగా వరద నష్ట ప్రభావం తీవ్రతరం కాకుండా సద్దు మణిగింది. ఈ ఏడాది కూడా అదే తరహాలో అధికారులు కృషి చేస్తారని ఆశిస్తున్నాం.
– యర్రంశెట్టి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు, కేదారిలంక

ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం



కపిలేశ్వరపురం ఫ్లడ్ స్టోర్‌లో తగిన సామగ్రిని సిద్ధం చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాలపై పనిచేస్తున్నాం. గోదావరి గట్లు బలంగానే ఉన్నాయి. వరద తీవ్రత పెరిగితే తగిన చర్యలు చేపట్టేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం.
–ఆర్.విశ్వనాథరాజు, హెడ్ వర్క్స్ ఏఈ

వైఎస్సార్ సీపీ నేత పశువుల పాకకు నిప్పు



ఘటనా స్థలం వద్ద ప్రజాప్రతినిధులకు పరిస్థితిని వివరిస్తున్న బాధితుడు సింహాచలం

కపిలేశ్వరపురం: వెదురుమూడికి చెందిన వైఎస్సార్ సీపీ దళిత నాయకుడు, కౌలు రైతు నక్కా సింహాచలానికి చెందిన పశువుల పాకకు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి నిప్పు పెట్టారు. మండపేట అగ్నిమాపక దళ సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. బాధితుడు నక్కా సింహాచలం సోమవారం మాట్లాడుతూ తాను కౌలు భూమి సాగు చేసుకుంటూ ఆరు పాడి గేదెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నానన్నారు. తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేని వ్యక్తులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారన్నారు. ఆసుపత్రి నుంచి తిరిగి వచ్చిన సమీపంలోని వ్యక్తులు పాక దగ్ధం కావడాన్ని చూశారని, వారు పశువులను కట్టిన తాళ్లను కోయడంతో ఆరు గేదెలు సురక్షితంగా బయటపడ్డాయన్నారు. రూ. 4 లక్షలు నష్టం వాటిల్లినట్టు తెలిపారు. మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఘటనా స్థలాన్ని సందర్శించి బాధితుడు నక్కా సింహాచలాన్ని పరామర్శించారు.

చేపల విక్రయదారులకు నోటీసులు

సాక్షి ఇంపాక్ట్

కాజులూరు: బహిరంగ ప్రదేశాలలో చేపలు, మాంసం విక్రయిస్తున్న వ్యాపారులకు నోటీసులు జారీ చేసినట్టు గొల్లపాలెం పంచాయతీ కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాలరావు తెలిపారు. మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం గ్రామాల్లో కాకినాడ, కోటిపల్లి రహదారిని ఆనుకుని పలు కూడళ్లలో వ్యాపారులు చేపలు, మాంసం విక్రయిస్తున్నారు. దీంతో అపారిశుధ్య వాతావరణం తలెత్తడమే కాకుండా రహదారిపై ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. దీనిపై సోమవారం 'సాక్షి' దినపత్రికలో 'బహిరంగ ప్రదేశాల్లో విక్రయాలు నిషేధించాలి' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన గొల్లపాలెం పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి వేణు
- పట్టణంలో గడప గడపకూ..



పట్టణంలో గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న మంత్రి వేణు

రామచంద్రపురం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలో సోమవారం ఉదయం 3వ వార్డు అంకం వారివీధిలోను, సాయంత్రం 4వ వార్డు సూర్యనగర్‌లోను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆయా కుటుంబాల్లో జగనన్న ప్రభుత్వం ద్వారా లబ్ధిని వివరిస్తూ వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రజలు వార్డులోని సమస్యలను మంత్రి వద్ద ప్రస్తావించారు. విద్యుత్ లైట్లు, డ్రైనేజీల సమస్యలు వంటివి వివరించగా వాటిని వెంటనే పరిష్కరించాలని మున్సిపాలిటీ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ దేశంలోఏ రాష్ట్రం అందించలేని పథకాలను ఏపీలో సీఎం జగన్ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడికి అందజేస్తున్నారన్నారు. ప్రతి గడపకి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరుతున్నాయన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ కె శ్రీకాంత్‌రెడ్డి, డీఈ దుర్గాప్రసాద్, స్థానిక కౌన్సిలర్ పాలపర్తి శ్వేతపావని, వాడ్రేవు సాయిప్రసాద్, పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు కొప్పిశెట్టి శ్రీను, పాలపర్తి మధు, కుడిపూడి గణేష్, పెంటపాటి శ్రీను, కంచుమర్తి బాబూరావు, మట్టా బాబులు, కోటిపల్లి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల దారి మళ్లింపు

రామచంద్రపురం: పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైలా ఉండే డ్రైన్‌ల పూడికతీత కారణంగా నేటి నుంచి పెద్ద వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు రామచంద్రపురం పట్టణ ఎస్సై డి.సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్ద వాహనాలు మెయిన్ రోడ్డులో వెళుతున్న కారణంగా పట్టణ వాసులకు ప్రధాన రహదారిలో ప్రయాణించేందుకు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. పెద్ద వాహనాలతో పాటుగా ఆర్టీసీ బస్సులను కూడా ఆర్టీసీ కాంప్లెక్స్‌ను బైపాస్ రోడ్డు మీదుగా మళ్లిస్తున్నామన్నారు. దీంతో రాజగోపాల్ సెంటర్, పాత బస్టాండ్, మార్కెట్ సెంటర్, బ్యాంకు సెంటర్లలో ఎక్కే ఆర్టీసీ ప్రయాణికులు ఆయా ప్రదేశాల్లో బస్ స్టాప్‌లు లేనందున ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లి బస్సులు ఎక్కాలన్నారు. నాలుగు రోజుల పాటు ఈ ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని ఎస్సై పేర్కొన్నారు.

పరిశోధనలు మానవ ప్రగతికి మార్గాలు



అంగరలో వాకా దివ్యశేఖర్‌ను సత్కరిస్తున్న వాసవీ క్లబ్ నాయకులు

కపిలేశ్వరపురం: ప్రాకృతికి అంశాలపై జరిపే పరిశోధనలు మానవజాతి ప్రగతికి మార్గం అవుతాయని అంగరలోని వాసవీ క్లబ్ నాయకులు అన్నారు. భూమి కదలికలపై పీహెచ్‌డీ పట్టా పొందిన అంగరలోని శ్రీసిద్ధార్థ కళాశాల పూర్వ విద్యార్థి వాకా దివ్యశేఖర్‌ను ఆదివారం వాసవీ క్లబ్, వాసవీ వనిత క్లబ్, వీకేఎస్‌పీ క్లబ్ సంయుక్త కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. పడమర ఖండ్రికలోని ధ్యానమందిరం, శ్రీఖండేశ్వరస్వామి ఆలయాలకు ఫ్యాన్లు, కుర్చీలు, అంగరలోని శ్రీవైభవ వేంకటేశ్వర స్వామి ఆలయానికి అభిషేక నిచ్చెనను, గోశాలకు దాణాను, పలు ఆలయాలకు అన్నదానం నిమిత్తం బియ్యాన్ని సమర్పించారు. ముఖ్య అతిథి, వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ వి 215ఎ గవర్నర్ మండవిల్లి మురళీ కృష్ణ మాట్లాడుతూ స్థానిక క్లబ్ స్థానిక కమిటీలు చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ నాయకులు కాళ్లకూరి ప్రవీణ్, గ్రంథి వీరకనకం, సురేష్, వెంకట రమణ, లక్ష్మీ ప్రియాంక, కేశవరపు శ్రీను, సంకా పట్టాభిరామయ్య, పులవర్తి లక్ష్మీపతి, కాళ్ళకూరి అర్జునరావు, దాసరి నాగమణి పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కవచం దిశ యాప్

- ఆపద వేళ సద్వినియోగం చేసుకోండి
- దిశ విభాగం డీఎస్పీ మురళీమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న దిశ డీఎస్పీ మురళీమోహన్

మండపేట: దిశ యాప్ మహిళలకు రక్షణ కవచంలా పనిచేస్తుందని, ప్రతి విద్యార్థినీ సెల్‌ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా దిశ విభాగం డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. వివిధ కళాశాలల విద్యార్థినులకు దిశ యాప్‌పై పోలీసులు సోమవారం అవగాహన కల్పించారు. పట్టణంలోని బాబు అండ్ బాబు కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మురళీమోహన్ మాట్లాడుతూ మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పోలీస్ శాఖ దిశ యాప్‌ను తీసుకు వచ్చిందన్నారు. ఆపదలో ఉన్న యువతులు, విద్యార్థినిలు, మహిళలు ఈ యాప్ ద్వారా సమాచారం అందిస్తే వెంటనే పోలీసులు వచ్చి రక్షిస్తారన్నారు. క్రైం సీఐ గోవిందరాజు మాట్లాడుతూ లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం గురించి వివరించారు. ఇల్లు వదిలి కుటుంబమంతా దూరప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినపుడు చోరీల బెడద లేకుండా ఎల్‌హెచ్‌ఎంఎస్ భరోసా ఇస్తుందన్నారు. సీఐ పి. శివగణేష్, ఎస్ఐలు ఎం అశోక్, కె. అప్పారావు, దిశ విభాగం ఎస్ఐ కనక దుర్గ, ఆదిత్య కళాశాల సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- చైర్‌పర్సన్ దుర్గారాణి
- గొల్లపుంత కాలనీలో జరుగుతున్న పనుల పరిశీలన



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సమస్యలు పరిష్కరించి పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.14 లక్షల వ్యయంతో 20వ వార్డు గొల్లపుంత కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం చైర్‌పర్సన్ దుర్గారాణి పరిశీలించారు. పనుల పురోగతి గురించి ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసులు ఆమె దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను మున్సిపల్ అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం కాలనీలోని మున్సిపల్ స్కూల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరు, ఆహార నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులకు రెండు జతల దుస్తులు, మూడు టవల్స్, పాదరక్షలు, కొబ్బరినూనె తదితర సామగ్రిని చైర్‌పర్సన్ దుర్గారాణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెరుగైన పారిశుధ్య నిర్వహణకు కృషి చేయాలని కోరారు. తొలుత మున్సిపల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో పాల్గొని రికార్డులను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఉద్యోగులకు చైర్‌పర్సన్ దుర్గారాణి సూచించారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా, వైఎస్సార్ సీపీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్లు చిట్టూరి సతీష్, కొవ్వాడ బేబీ, శెట్టి కళ్యాణి, నీలం దుర్గ, మొండి భవాని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు,

పేదల విద్యకు ప్రభుత్వం పెద్దపీట

- మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి
- జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ



అర్తమూరులో విద్యార్థులకు కిట్లు అందిస్తున్న సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి దంపతులు

మండపేట: ప్రతీ పేద విద్యార్థి ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. స్థానిక గొల్లపుంత కాలనీలోని ఎస్ఎస్‌వీవీ మున్సిపల్ స్కూల్ విద్యార్థులకు సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను పనికి కాకుండా బడికి పంపాలని సూచించారు. షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా, కౌన్సిలర్లు కొవ్వాడ బేబి, శెట్టి కల్యాణి, ఏఎంసీ డైరెక్టర్ షేక్ మస్తాన్, సచివాలయ కన్వీనర్ పేరూరి మాధవి, బత్తిన దొరబాబు, కామ్మోజు తదితరులు పాల్గొన్నారు.

అర్తమూరులో..

అర్తమూరు శ్రీసత్యభాస్కర జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఆ గ్రామంలోని నాలుగు పాఠశాలల విద్యార్థులకు సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతులు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాంలు, షూలు, బ్యాగులు తదితర సామాగ్రిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు మండ సుమలత, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు గొలుగూరి సందీప్ రెడ్డి, చిర్ల జయరాంరెడ్డి, పార్టీ నాయకులు కొవ్వూరి నాగిరెడ్డి, మండ గొల్లారెడ్డి, మండ నాగిరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు ఘన సత్కారం



హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాలును సత్కరిస్తున్న ఎంపీ బోస్ తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాద, వెల్ల గ్రామాల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన జగనన్న ఆణిముత్యాలకు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల సమక్షంలో సోమవారం ఘనంగా సత్కరించారు. హసన్‌బాదలో హెచ్‌ఎం పీఎస్‌బీఎస్‌కే సుందరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, ఎంపీటీసీ యెన్నం దేవి, ఉప సర్పంచ్ దేవి, పేరెంట్స్ కమిటీ సభ్యుడు యెరుబండి నాగేశ్వరరావుల చేతుల మీదుగా విద్యార్థులు పులిదిండి సుభాష్ సంజయ్‌రామ్, వలివేటి భాగ్యశ్రీ, కొప్పిశెట్టి కీర్తనలను నగదు బహుమతి, మెడల్స్‌తో సత్కరించారు. అదేవిదంగా వెల్ల జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం బి.వీరభద్రరాజు ఆధ్వర్యంలో సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఎంపీటీసీ చిక్కాల స్వామికాపు, ఉపాధ్యాయుల చేతుల మీదుగా విద్యార్థులు పెన్నాడ శివసాయి శ్రావణ్‌కుమార్, నరాల సురేష్, కోటిపల్లి ఆదిత్యస్వరూప్‌లను నగదు బహుమతి, మెడల్స్‌తో సత్కరించారు.

మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

కపిలేశ్వరపురం: జగనన్న ఆణిముత్యాలు పథకంలో భాగంగా సోమవారం నల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం రామలక్ష్మి పర్యవేక్షణలో పీఎంసీ చైర్మన్ కాలా కిశోర్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రగతి సాధించిన విద్యార్థులకు ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పాఠశాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.3వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున అందజేశారు. కార్యక్రమంలో మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ, ఏఎంసీ డైరెక్టర్ కురుపూడి భువనేశ్వరి, ఉప సర్పంచ్ అనంతలక్ష్మి, సచివాలయం కన్వీనర్లు అతికెల శంభులింగం, సవిలే జయంతిబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం కృషి

కాజులూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల మెరుగుదలకు సీఎం జగనన్న ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని గొల్లపాలెం సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక అన్నారు. పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందజేసిన మెడల్స్, నగదు పారితోషకాలను సోమవారం పాఠశాలలో సర్పంచ్ ప్రసన్నమౌనిక, పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి తదితరులు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరిదేవి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ మాత నాగరాజు, ఆర్ఎంసీ వైస్ చైర్మన్ కాకతీయ రాజు, డైరెక్టర్ ఈశ్వర రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాయవరం: మాచవరం, చెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు జగన్మోహిని, రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో చెల్లూరు సర్పంచ్ పాలిక రాఘవ, ఎంపీటీసీలు వైట్ల వీరవేణి, పీవీ ఆదిలక్ష్మి, గొల్లపల్లి అనూరాధ, మాచవరం ఉప సర్పంచ్ పడాల వసంత్‌కుమార్‌రెడ్డి, మేడపాటి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నేత మేడపాటి చంద్రశేఖరరెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి వరుసగా మూడు వేలు, రెండు వేలు, వెయ్యి రూపాయల నగదు పురస్కారాలు అందజేశారు. సచివాలయ మండల కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, పాఠశాల చైర్మన్ వెలగల అచ్యుత రామారెడ్డి, వైస్ చైర్మన్ మేడపాటి భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

పాల డెయిరీ ఏర్పాటుపై అవగాహన



ఓడూరులో మహిళా పాల డెయిరీపై అవగాహన కల్పిస్తున్న ఏడీ రామకృష్ణ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఓడూరు గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం అమూల్ సహకారంతో మహిళా పాల డైరీ ఏర్పాటుకు సంబంధించి సహకార సంఘాన్ని 11 మంది మహిళా సభ్యులతో ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించారు. రామచంద్రపురం పశు వైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ ఓ.రామకృష్ణ మాట్లాడుతూ సీఎం జగన్ మహిళా పాడి రైతులకు స్థిరమైన ఆదాయం సమకూరేలా అన్ని గ్రామాల్లోనూ అమూల్ డైరీలు ఏర్పాటు చేసి మహిళలతోనే నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. అంతే కాకుండా ప్రతి 10 రోజులకు పేమెంట్లు ఆన్‌లైన్‌లో పాడి రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్‌లో డైరీ కేంద్రం ద్వారా పశుదాణా, ఇన్‌పుట్స్, లోన్లు అందించడమే కాకుండా పశు సంవర్ధక శాఖ ద్వారా ఇన్సూరెన్స్‌లు చేయించడం, గడ్డి రకాల విత్తనాల అందజేయడం తదితర అన్ని సేవలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ పరమటి జ్ఞానలక్ష్మి, సర్పంచ్ కొండేపూడి ప్రసన్న, ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు, ఏఓ ఎస్.సత్యప్రసాద్, పశు వైద్యాధికారులు పంపన రామచంద్రరావు, డాక్టర్ జి.విజయ దుర్గ, ఏపీఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.